సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

గురువారం । 31 । జూలై । 2025



మానుకోటను కాషాయ కోటగా మార్చాలి - 8లో▸

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి మానుకోటను కాషాయకోటగా మార్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు.



వరుణుడి దోబూచులాట..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వర్షం దోబూచులాడుతోంది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33⁰/25⁰

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దర్గా ఉత్సవాలకు రండి
సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



హన్మకొండ చౌరస్తా: కాజీపేట దర్గా (సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ) ఉత్సవాలకు రావాల్సిందిగా.. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి దర్గా పీఠాధిపతి ఖుస్రూ పాషా సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో బుధవారం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా మర్యాద పూర్వకంగా కలిశారు.

నకిలీ లూబ్రికెంట్ ఆయిల్ స్వాధీనం



రామన్నపేట: మట్టెవాడలోని స్పార్క్ లూబ్రికెంట్ షాప్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన నకిలీ లూబ్రికెంట్ ఆయిల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. రూ.91,620 విలువైన నకిలీ ఆయిల్‌తో పాటు షాపు నిర్వాహకుడు జూలైవాడకు చెందిన నకరకంటి మురళీధరమ్, రంగశాయిపేటకు చెందిన దంతూరి ఉదయ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి తదుపరి విచారణ కోసం మట్టెవాడ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈదాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రకాళి ఆలయంలో నిత్యాన్నదాన టోకెన్ల పెంపు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి దేవాలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదానం టోకెన్ల సంఖ్యను పెంచుతూ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ అడిషనల్ కమిషనర్ ఎంఎండీ కృష్ణవేణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. నిత్యాన్నదానంలో భాగంగా.. భక్తులకు రోజూ 200 టోకెన్లు ఇస్తుండగా.. ఇక నుంచి 300 మంది మందికి ఇవ్వనున్నారు. శుక్రవారం, ఆదివారం ఇప్పటి వరకు 300 టోకెన్లు ఇస్తుండగా.. 500 మందికి ఇవ్వనున్నారు. దేవాలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా నిత్యాన్నదానం టోకెన్ల సంఖ్య పెంచాలని పలుమార్లు దేవాదాయశాఖకు విజ్ఞప్తి చేసినట్లు ఆలయ ఈఓ శేషుభారతి తెలిపారు.

పదోన్నతులతో బాధ్యతలు పెరుగుతాయి



వరంగల్ క్రైం: పదోన్నతులతో బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఇ.రాజు, విజయకుమార్, బి.రాజమౌళి, పి.సారయ్య, ఎం.నరేంద్రచారి బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించారు. ఈసందర్భంగా పదోన్నతి పొందిన ఎస్సైల భుజాలపై సీపీ నక్షత్రాలు అలంకరించి అభినందించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులపై నమ్మకం, కలిగించడంతో పాటు నిరుపేదలకు పోలీసులు అండగా నిలవాలని సూచించారు.

విద్యార్థి సంఘాల ముసుగులో బెదిరింపులు

విద్యారణ్యపురి: 'గుర్తింపులేని విద్యార్థి సంఘాలకు నాయకులమని చెప్పి కొంతమంది ప్రైవేట్ స్కూళ్లలోకి అనుమతి లేకుండా ప్రవేశిస్తున్నారు. స్కూళ్ల కరస్పాండెంట్లను బెదిరిస్తున్నారు' అని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా-వడుప్సా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాదాల సతీశ్‌కుమార్, కోశాధికారి ముక్తేశ్వర్, హనుమకొండ జోన్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి బుధవారం హనుమకొండలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. డబ్బులు డిమాండ్ చేస్తూ.. కులం పేరు చెబుతూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని కమిషనర్‌కు విన్నవించారు. ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీపీ తమకు హామీ ఇచ్చినట్లు ట్రస్మా బాధ్యులు తెలిపారు.

చెర వీడేనా?

కబ్జా కోరల్లో నగరంలోని గొలుసుకట్టు చెరువులు

- ఆక్రమణల వెనుక కొందరు నాయకులు, రెవెన్యూ అధికారులు
- అండగా జీడబ్ల్యూఎంసీ, ఇరిగేషన్ ఆఫీసర్లు
- లోకాయుక్త, సీఎస్ వరకు ఫిర్యాదులు
- రోజురోజుకూ పెరుగుతున్న ఆక్రమణలు
- ఎట్టకేలకు 'భద్రకాళి' ఆక్రమణలపై సర్వే
- కలెక్టర్ ఆదేశంతో కదిలిన అధికార యంత్రాంగం

సాక్షిప్రతినిధి, వరంగల్:

గొలుసుకట్టు చెరువులు కబ్జాదారుల చెరను వీడేదెన్నడు? అనే చర్చ గ్రేటర్ వరంగల్ నగరంలో సాగుతోంది. నీటి అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న కాకతీయుల కాలం నాటి ఈ చెరువుల ఆక్రమణలపై ఏళ్ల తరబడి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంటున్నాయి. హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ ఎసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఏర్పడిన తర్వాత వరంగల్‌లోనూ కొంత కదలిక వచ్చింది. చెరువులు, కుంటలు (ఫుల్ ట్యాంక్ లెవల్) బఫర్ జోన్లలో అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతోందన్న చర్చ జరిగింది. ఆక్రమణదారులు, కబ్జాదారులు ఆందోళనకు గురయ్యారు. ఆక్రమణలకు పాల్పడే వారిలోనూ ఆందోళన మొదలైంది. ఆతర్వాత మళ్లీ పరిస్థితులు సాధారణంగా మారడంతో చెరువుల చుట్టూ ఆక్రమణలు పెరుగుతున్నాయి.

అన్ని చోట్లా ఆక్రమణలే..

వరంగల్ ట్రై సిటీలోని చెరువుల శిఖం భూములన్నీ కబ్జాకు గురైనవే.. 849 సర్వే నంబర్‌లోని 386 ఎకరాల విస్తీర్ణంలోని చారిత్రక భద్రకాళి చెరువు కాకతీయుల గొలుసుకట్టు చెరువుల్లో కీలకమైంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్‌లోనూ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. 50–60 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు ఆధారాలతో లోకాయుక్త వరకు ఫిర్యాదులు వెళ్లాయి. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వరంగల్ గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు ఆక్రమణలతో ఆనవాళ్లు కోల్పోయింది. సర్వేనంబర్ 542లో 22.04 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సిన ఈ చెరువు 12 ఎకరాలకు తగ్గింది. సుమారు పదెకరాల వరకు కబ్జాకు గురైంది. ఇందులోనూ కొందరు రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల ప్రమేయం ఉండడంతో చర్యలు తీసుకోలేదనే చర్చ ఉంది. రంగశాయపేటలో సర్వేనంబర్ 241లోని బెస్తం చెరువు విస్తీర్ణం 105 ఎకరాలు కాగా.. కొందరు రెవెన్యూ, నీటిపారుదలశాఖల అధికారుల అండదండలతో ఈ చెరువు ఆక్రమణలకు గురైంది. వెల్లువెత్తిన ఫిర్యాదుల నేపథ్యంలో.. 2020లో సర్వే చేసిన అధికారులు 40 ఎకరాల మేరకు ఆక్రమణకు గురైనట్లు తేల్చినా.. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. సర్వేనంబర్ 553లో 159.10 ఎకరాల్లోని న్యూశాయంపేట కోట (కోటి) చెరువు 134 ఎకరాలకు తగ్గింది. కాజీపేటలోని బంధం చెరువు కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని కుచించుకుపోయింది. 32 సర్వేనంబర్‌లో 57 ఎకరాల విస్తీర్ణంలో ఉండే చెరువు 25–30 ఎకరాలకే పరిమితమైంది. సర్వేనంబర్ 300లో వంద ఎకరాలకుపైగా ఉన్న చెరువులో 30–35 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైనట్లు అప్పట్లో అధికారులే ప్రకటించారు. ఇవి మచ్చుకు కొన్నే కాగా.. చాలా వరకు గొలుసుకట్టు చెరువులు ఆక్రమణకు గురవడంపై నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎట్టకేలకు భద్రకాళి చెరువు సర్వే

భద్రకాళి చెరువుతో పాటు పలు దేవాదాయ భూములు, చెరువుల ఆక్రమణలపై లోకాయుక్తలో కేసులు నడుస్తున్నాయి. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రెవెన్యూ అధికారులు.. వారికి సహకరించే మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై చాలా రోజులుగా విచారణ జరుగుతోంది. ఇదే సమయంలో కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజు ఇటీవల కలెక్టర్ స్నేహశబరీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో భద్రకాళి చెరువు భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని, అదే విధంగా ఆ భూముల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సర్వే, ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్, హనుమకొండ ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు. ఈమేరకు బుధవారం సర్వేయర్ పాండ్యాల రాజేశ్, సిబ్బంది ఎఫ్‌టీఎల్ పరిధిని మ్యాప్ ప్రకారం రెవెన్యూ సిబ్బందితో మార్కింగ్ చేస్తూ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో రాష్ట్రీయ హిందు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్, దేవాలయ పరిరక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ పల్లపు అశోక్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. చెరువుల ఆక్రమణలపై వెంటనే స్పందించి సర్వేకు కలెక్టర్ ఆదేశించడంపై హర్షం వ్యక్తం అవుతుండగా.. మిగతా చెరువులు కూడా ఆక్రమణదారుల చెరవీడేలా చూడాలని కోరుతున్నారు.



ఎఫ్‌టీఎల్ మ్యాప్ ప్రకారం భద్రకాళి చెరువు హద్దులు, కొలతలను మార్కింగ్ చేస్తూ సర్వే నిర్వహిస్తున్న అధికారులు



గూగుల్ మ్యాప్‌లో భద్రకాళి చెరువు

పరేడ్ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు



పోలీస్ డ్యూటీ మీట్‌కు సిద్ధం

ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో నేటినుంచి మూడు రోజులపాటు తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ –2025 నిర్వహించనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మీట్ ఏర్పాట్లను బుధవారం సీపీ సన్‌ప్రీత్‌సింగ్ పరిశీలించారు. - 8లో▸

మురుగు కాల్వలపై మెష్‌లు ఏర్పాటు చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న మేయర్ సుధారాణి

రామన్నపేట: నగరంలోని ప్రధాన జంక్షన్లలోని మురుగు కాల్వలపై వెంటనే మెష్‌లు ఏర్పాటు చేయాలని గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేటర్ పరిధిలో చేపడుతున్న వంద రోజుల కార్యక్రమాల్లో భాగంగా బుధవారం వరంగల్‌లోని బట్టలబజార్, కృష్ణాకాలనీ, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, డీమార్ట్ ఎదుట, చార్‌బౌళి, ఎల్లమ్మ గుడి ప్రాంతాల్లో మురుగు కాల్వల జంక్షన్లను, మురుగునీరు నిలిచే ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. నగరంలో దాదాపు వంద మురుగు కాలువ జంక్షన్లు ఉన్నాయని, వాటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మెష్‌లను ఏర్పాటు చేయడంతో పాటు డ్రెయిన్‌లలో వరద నీరు సాఫీగా వెళ్లేలా ప్రతీరోజు శుభ్రం చేయాలన్నారు. ఐసీసీసీకి మ్యాపింగ్ చేసి, క్రమం తప్పకుండా మానిటరింగ్ చేయాలన్నారు. మురుగు కాల్వలపై కల్వర్టులు లేని చోట తక్షణమే నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఎంహెచ్‌ఓ రాజేశ్, డీఈలు, ఏఈలు, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బందికి శిక్షణ

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో కేయూలోని పదిమంది బోధనేతర సిబ్బందికి ఆఫీస్ ప్రొడక్టివిటీపై 3రోజులపాటు నిర్వహించిన శిక్షణ బుధవారం సాయంత్రం ముగిసింది. రోజువారీ కార్యాలయ పనితీరు, వేగం, ఉత్పాదకత, ఔట్‌పుట్ పెంపుదల టెక్నిక్‌లు, టెక్నాలజీ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో కె.శ్రీనివాస్, బి.శ్రీనివాస్, కృష్ణమూర్తి, బి.కల్పన, పి.శ్రీరాం, కె.ప్రవశిత్‌కుమార్, కె.రజనీ, శివాజీగౌడ్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన.. మెరుగైన వసతులు

- బెస్ట్ పీఎంశ్రీ స్కూల్స్‌గా గవిచర్ల మోడల్ స్కూల్, హసన్‌పర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపిక
- ఎస్‌ఈపీ వార్షికోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్రం
- మరిన్ని సదుపాయాల కల్పనకు నిధులు వచ్చే చాన్స్



హసన్‌పర్తి పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో ప్రయోగం చేస్తున్న విద్యార్థులు

విద్యారణ్యపురి: కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్‌ఈపీ)ని అమల్లోకి తీసుకొచ్చి ఐదు సంవత్సరాలు పూర్తయ్యింది. ఎంపిక చేసిన పీఎంశ్రీ స్కూళ్లలో వసతులు కల్పించేందుకు నిధులు కేటాయిస్తోంది. ఎన్‌ఈపీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేశంలో 644 పాఠశాలలను కేంద్రం ఉత్తమ పాఠశాలలుగా ఎంపిక చేసింది. ఇందులో ప్రతీ జిల్లాకు ఒకటి చొప్పున పీఎం స్కూల్ ఉంది. నాణ్యమైన బోధన, మెరుగైన వసతులు, విద్యార్థుల నమోదు ప్రాతిపదికన వరంగల్ జిల్లా సంగెం మండలం గవిచర్ల మోడల్ స్కూల్ (పీఎంశ్రీ), హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పీఎంశ్రీ)ను బెస్ట్ పీఎంశ్రీ స్కూళ్లుగా ఎంపిక చేశారు. వీటిలో మరిన్ని సదుపాయాల కల్పనకు కేంద్రం నిధులు కేటాయించే అవకాశం ఉంది.

గవిచర్ల మోడల్ స్కూల్..

గవిచర్ల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్యనందిస్తున్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు ఉన్నాయి. స్కూల్‌లో 600 మంది విద్యార్థులు, ఇద్దరు ఒకేషనల్ టీచర్లు, ఒకరు అవర్లీ బేస్ట్ టీచర్ ఉన్నారు. నాలుగు సైన్స్ ల్యాబ్‌లు, రెండు ఒకేషనల్ ల్యాబ్‌లు, ఒక కంప్యూటర్ ల్యాబ్, ఏడు డిజిటల్ క్లాస్‌రూంలు ఉన్నాయి. ఇటీవల మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా వచ్చాయి. ఇందుకోసం మ్యూజిక్ ఇన్‌స్ట్రక్టర్‌ను కూడా నియమించనున్నారు. పీఎంశ్రీకి ఎంపికైన ఈ స్కూల్‌లో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. ల్యాబ్‌లోని పరికరాలకు కేంద్రం నిధులు మంజూరు చేయగా.. రాష్ట్ర విద్యాశాఖలోని సమగ్రశిక్ష నుంచి రూ.10 లక్షల విలువచేసే పరికరాలను అందజేసింది. విద్యార్థుల కోసం లైబ్రరీ ఉంది. అదేవిధంగా విద్యార్థులకు యోగాతోపాటు చెస్, ఖోఖోలో శిక్షణ ఇస్తున్నారు.

హసన్‌పర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల..

హనుమకొండ జిల్లా హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బెస్ట్ పీఎంశ్రీ స్కూల్‌గా ఎంపికైంది. ఆరు నుంచి పదో తరగతి వరకు 140 మంది బాలురు, 105 మంది బాలికలు ఉన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ ఉన్నాయి. సమగ్రశిక్ష నుంచి రూ.10 లక్షల విలువైన పరికరాలను అందుబాటులో ఉంచారు. ఇన్‌ప్లాంట్ ప్యానల్ సాయంతో యూట్యూబ్ ద్వారా బోధిస్తున్నారు. ఈ స్కూల్‌లో వివిధ సదుపాయాలకు రూ.లక్ష వరకు నిధులు వస్తున్నాయి. అదేవిధంగా విద్యార్థులకు గ్రంథాలయాన్ని కూడా అందుబాటులో ఉంచారు. బాక్సింగ్ పోటీల్లో హసన్‌పర్తి పాఠశాల విద్యార్థులు రాణిస్తున్నారు. 10 మంది విద్యార్థులు జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీలో ఫిజికల్ డైరెక్టర్ శిక్షణ ఇస్తున్నారు. తరగతి గదుల మరమ్మతుల కోసం రూ.7 లక్షలు విడుదలయ్యాయి. ప్రతి ఏడాది పీఎంశ్రీ స్కూల్‌గా గ్రాంట్ రూ.75 వేలు వస్తున్నాయి. ఖాళీ స్థలంలో కిచెన్ గార్డెన్‌ను కూడా ఏర్పాటు చేశారు.

బెస్ట్ పీఎంశ్రీ స్కూళ్లు జాతికి అంకితం..

దేశంలో ఎంపికచేసిన బెస్ట్ పీఎంశ్రీ స్కూళ్లను ఈనెల 29న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ జాతికి అంకితం చేశారు. గవిచర్ల మోడల్ స్కూల్‌లో వరంగల్ డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్, స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొని జాతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా హసన్‌పర్తి పాఠశాలలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పీజీ హెచ్‌ఎం ఎన్నంశెట్టి సుమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొని జాతికి అంకితం చేశారు.


సంతోషంగా ఉంది..



హనుమకొండ జిల్లాలో 19 పీఎంశ్రీ స్కూల్స్ ఉన్నా యి. అందులో నుంచి హసన్‌పర్తి హైస్కూల్ బెస్ట్ స్కూల్‌గా ఎంపికవడం సంతోషంగా ఉంది. విద్యార్థులకు అనేక సదుపాయాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. ఈఏడాది టెన్త్‌లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థుల నమోదు కూడా గత ఏడాది కంటే ఎక్కువగానే పెరిగింది.

– సుమాదేవి, హసన్‌పర్తి హైస్కూల్ పీజీ హెచ్‌ఎం

నాణ్యమైన విద్యకు గుర్తింపు..



గవిచర్ల మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నాణ్య మైన విద్యను అందిస్తున్నాం. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు కూడా సాధిస్తున్నారు అందుకు గుర్తింపుగానే వరంగల్ జిల్లాలో బెస్ట్ పీఎంశ్రీ స్కూల్‌గా ఎంపికైందని భావిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులతోనూ సమావేశాలు నిర్వహిస్తున్నాం.

–ఎస్పీ ప్రసన్నలక్ష్మి, గవిచర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

ఉచిత శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

న్యూశాయంపేట: గ్రూప్స్, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు 4 నెలల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు హనుమకొండ జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కేపీ.గౌస్ హైదర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ మైనార్టీస్ స్టడీ సర్కిల్, కెరీర్ కౌన్సెలింగ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉచిత శిక్షణ పొందేందుకు దరఖాస్తుల గడువు ఆగస్టు, 21 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ అభ్యర్థులు వినియోగించుకోవాలని, మరిన్ని వివరాలకు హనుమకొండ కలెక్టరేట్‌లో లేదా 95504 49464 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

వేగంగా.. సులువుగా

భక్తులు వనదేవతలను దర్శించుకునేలా సమాలోచనలు

- మేడారంలో పూజారులతో కలిసి గద్దెల ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్
- పూజారులదే తుది నిర్ణయం



అధికారులు, పూజారులతో కలిసి గద్దెల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర టీఎస్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల దర్శనాన్ని భక్తులకు సులువుగా కల్పించేందుకు అధికారులు, పూజారులు సమాలోచనలు చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం ములుగు కలెక్టర్ దివాకర టీఎస్, డీఎస్పీ రవీందర్, ఈఓ వీరస్వామి, సమ్మక్క– సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుల పూజారులతో కలిసి అమ్మవార్ల గద్దెల ప్రాంగణాన్ని సందర్శించారు. గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను వరుస క్రమంలో ఏర్పాటు చేయడం వల్ల భక్తులకు సులువుగా దర్శనం కలుగుతుందన్న ఆలోచనపై పూజారులతో చర్చించారు ఆర్కిటెక్ట్ బృందం రూపొందించిన మాస్టర్‌ప్లాన్, అధికారులు తయారు చేసిన మ్యాప్‌లను పూజారులకు కలెక్టర్ వివరించారు.

అంతిమ నిర్ణయం పూజారులదే..

ఆర్కిటెక్ట్ బృందం రూపొందించిన మాస్టర్‌ప్లాన్ వల్ల అమ్మవార్ల దర్శనంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తుతాయనే అభిప్రాయాన్ని పూజారులు అధికారులకు వివరించారు. కానీ, అధికారులు సమ్మక్క–సారలమ్మల గద్దెల పక్కన వరుస క్రమంలో గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను ఉంచడంపై పూజారులు సమాలోచనతో సానుకూల నిర్ణయానికి వచ్చారు. సారలమ్మ ఎంట్రెన్స్ గేట్‌ను సుమారుగా 20 ఫీట్ల దూరం విస్తరించి వరుస క్రమంలో గోవిందరాజు, పగిడిద్దరాజుల గద్దెలను ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అభిప్రాయాన్ని పూజారులు కొంతమేరకు ఏకీభవించారు. నలుగురు దేవతలు వరుస క్రమంలో ఉండడం వల్ల టీడీటీ కల్యాణ మండపం ద్వారా, ఆర్టీసీ బస్టాండ్ క్యూలైన్ ద్వారా వచ్చే భక్తులకు రెండు వైపులా దర్శనం సులువుగా ఉంటుందని భావిస్తున్నారు. అదేవిధంగా రెండు వైపులా క్యూలైన్‌ల ద్వారా గద్దెల ప్రాంగణంలోకి వచ్చిన భక్తుల్లో ఒకేసారి పదిమంది వెళ్లేలా వెడల్పాటి మరో క్యూలైన్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు వివరించారు. కాగా, గద్దెల మార్పుపై రెండుమూడు రోజుల్లో పూజారులతో చర్చించి అభిప్రాయాన్ని వెల్లడిస్తామని గోవిందరాజు పూజారి.. అధికారులకు తెలిపారు.

మొక్కుల చెల్లింపులో ఇబ్బంది లేకుండా..

అమ్మవార్లకు పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, ఒడిబియ్యం, కానుకల చెల్లింపులో భక్తులు ఇబ్బందులు పడకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా అధికారులు పరిశీలించారు. సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజును వరుస క్రమంలో భక్తులు దర్శించుకునే సమయంలో పూజారులు సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద క్యూలైన్ లోపల ఉండి భక్తులు సమర్పించిన ఎత్తు బంగారం తీసుకుని తిరిగి ప్రసాదం అందించడంతోపాటు మొక్కు బంగారాన్ని ఎప్పటికప్పుడు బయటకు తరలించే మార్గాలను పరిశీలించారు. నాలుగు గద్దెలు వరుస క్రమంలో ఉంటే వీఐపీ, వీవీఐపీల దర్శనం సమయంలోనూ సాధారణ భక్తులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా వీవీఐపీలు అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం నేరుగా హెలిపాడ్ ప్రదేశానికి వెళ్లేలా సారలమ్మ ఎగ్జిట్ గేట్ నుంచి ఐరన్‌తో ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే మరింత సులువుగా ఉంటుందని సమాలోచన చేశారు. పూజారులు తమ నిర్ణయాన్ని త్వరగా తెలిపితే 15 రోజుల్లో పనులు మొదలు పెడతామని కలెక్టర్ దివాకర టీఎస్ చెప్పారు.

షెడ్యూల్ ప్రకారం దర్శనం పాస్‌లు..

ఈసారి మహాజాతరలో వీఐపీ, వీవీఐపీలు, అధికారులు, మీడియాకు షెడ్యూల్ ప్రకారం దర్శనం పాస్‌లు జారీ చేయాలనుకుంటున్నారు. అందరికీ ఒకేసారి పాస్‌లు జారీ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఈసారి జాతరకు ముందుగా నాలుగైదు తేదీల్లో పాస్‌లు జారీ చేయడంతో ఇబ్బందులు తప్పుతాయని అధికారులు భావిస్తున్నారు. జాతర నాలుగు రోజుల్లో ఎమ్మెల్యే, ఆపైస్థాయి వారికి పాస్‌లు జారీ చేసే ఆలోచన చేస్తామని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా సమ్మక్క మ్యూజియం, సారలమ్మ ఎంట్రెన్స్ నుంచి జంపన్నవాగు ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు దారిని విస్తరించాలని పూజారులు కలెక్టర్‌ను కోరారు. కాగా, రోడ్డును కూడా కలెక్టర్.. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.

భూ నిర్వాసితులకు ఆర్బిట్రేషన్



రైతులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్

న్యూశాయంపేట: గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవేలో భూములు కోల్పోయిన గీసుకొండ మండలం మనుగొండ, సంగెం మండలం సంగెం గ్రామాల భూ నిర్వాసితులకు అవార్డ్ పాస్ చేసేందుకు వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధ్యక్షతన బుధవారం ఆర్బిట్రేషన్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు రియాజుద్దీన్, రాజ్‌కుమార్, నేషనల్ హైవే సైట్ ఇంజనీర్ ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్‌డీసీ



న్యూశాయంపేట: స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్‌డీసీ)గా పదోన్నతి పొందిన వరంగల్ ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్యాశారదను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేట్‌కు మోదీ సర్కారు ఊడిగం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ర్యాలీలో పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, నాయకులు

ఖిలా వరంగల్: కేంద్రంలోని మోదీ సర్కారు కార్పొరేట్‌కు ఊడిగం చేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. వరంగల్ అబ్బాస్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ప్రారంభమైన పార్టీ వరంగల్ జిల్లా ద్వితీయ మహాసభల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అమలు చేయకుండా, ప్రజల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. 11 ఏళ్లుగా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో ముందుకు సాగుతోందని విమర్శించారు. కమ్యూనిస్టులను అంతం చేయలేరని, కమ్యూనిజం ప్రపంచ వ్యాప్త సిద్ధాంతం అని స్పష్టం చేశారు. అన్ని దేశాల్లో కమ్యూనిస్టులు ఉన్నారన్న విషయం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు గుర్తెరగాలని, కమ్యూనిస్టులకు బద్ధశత్రువే బీజేపీ అని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలని వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విభజన చట్టంలోని హామీలను నెరవేర్చడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు.

నగరంలో భారీ ప్రదర్శన

సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా బుధవారం నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. శివనగర్‌లోని తమ్మెర భవనం నుంచి వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మమైదాన్ వరకు ర్యాలీ సాగింది. సీపీఐ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు మేకల రవి, కర్రె భిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేశ్, సయ్యద్ వలీఉల్లాఖాద్రి, పల్లె నర్సింహా, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే బాష్‌మియా, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

6న మెగా జాబ్‌మేళా

ఏటూరునాగారం: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఆగస్టు 6న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డీఫార్మ్, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ చదివిన నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలను కల్పించనున్నామన్నారు. ఏటూరునాగారంలోని గిరిజన భవన్‌లో 6వ తేదీన ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో హాజరుకావాలని కోరారు. మరింత సమాచారం కోసం 9490341911, 8008932159 నంబర్లను సంప్రదించాలన్నారు.

వరద తగ్గుముఖం..

కాళేశ్వరం: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద తగ్గుతోంది. బుధవారం కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ వద్ద 2.89 లక్షల క్యూసెక్కుల వరద తరలివచ్చింది. అదేస్థాయిలో బ్యారేజీలోని మొత్తం 85గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. గోదావరి, ప్రాణహితల ద్వారా సోమవారం 5.12లక్షల క్యూసెక్కులు తరలొచ్చిన విషయం తెలిసిందే.

కార్మిక హక్కులను హరిస్తున్న పాలకులు

- ఎంసీపీఐ(యూ) జాతీయ కార్యదర్శి అశోక్ ఓంకార్

రామన్నపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను హరిస్తూ పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తున్నాయని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. బుధవారం వరంగల్‌లోని ఓంకార్ భవన్‌లో పార్టీ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మహబూబ్ పాషాతో పాటు పలువురు నాయకులు పార్టీలో చేరగా వారికి అశోక్ ఓంకార్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 15వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌పోర్ట్ రంగం కార్మిక వర్గాన్ని ఆదుకునేలా హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోనె కుమారస్వామి, మంద రవి, జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుంచు జగదీశ్వర్, ముక్కెర రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర క్షేత్రాల దర్శన యాత్ర



యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విఘ్నేష్ జీ

నయీంనగర్: పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ జీ తెలిపారు. బుధవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ యాత్ర సెప్టెంబర్ 9న ప్రారంభమవుతుందన్నారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్లగొండ, హైదరాబాద్, కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కే వీలుందని పేర్కొన్నారు. ఈ యాత్ర 15 రోజులు జరగనుందని తెలిపారు. ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధపూర్, మథుర, అయోధ్య, ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ పుణ్యక్షేత్రాలు కవర్ చేస్తామని తెలిపారు. టికెట్లను 93550 21516 ఫోన్‌నంబర్‌కు కాల్ చేసి బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు. యాకేశ్, సంతోష్ ఉన్నారు.

వరుణుడి దోబూచులాట..

ఉమ్మడి వరంగల్‌లో వర్షపాతం సాధారణమే..
- జనగామ జిల్లాలో లోటు
- ఇతర జిల్లాల్లో సాధారణం
- ఊపందుకున్న పంటల సాగు



హసన్‌పర్తి మండలం ముచ్చర్ల నాగారంలో నాటు వేస్తున్న వ్యవసాయ కూలీలు



నారు పంచుతున్న మహిళ

హన్మకొండ: వర్షాకాలం ఉమ్మడి వరంగల్ జిల్లాను దోబూచులాడుతోంది. కురువాలా? వద్దా అని ఆలోచిస్తున్నట్లు అనిపిస్తోంది. వరుసగా ఆరు రోజులు వర్షాలు కురిసినా సాధారణాన్ని మించలేదు. కొన్ని ప్రాంతాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. సోమవారం నుంచి శనివారం వరకు వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో తేలిక నుంచి మోస్తరుగా కురువగా, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అయినా లోటు తీరలేదు. ఈ వర్షంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రధానంగా వరి నాట్లు ఊపందుకున్నాయి. ఈ వర్షం కురిసే వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 21 నుంచి 24 వరకు కురిసిన వర్షాలు రైతుల్లో సంతోషాన్ని నింపాయి. అయితే చెరువులు, కుంటల్లోకి పూర్తి స్థాయిలో నీరు చేరలేదు. కాగా, ఈ నెల 30 వరకు జనగామ జిల్లాలో లోటు వర్షపాతం నమోదు కాగా, ఇతర జిల్లాలో సాధారణంగా నమోదైంది.

ములుగు జిల్లాలో సాధారణమే..

ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురిసినా సాధారణాన్ని మించలేదు. వర్షాకాలంలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 567.3 మిల్లీ మీటర్లుగా కాగా ఇప్పటి వరకు 552.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలో ములుగు, కన్నాయిగూడెం, వాజేడు మండలాల్లో లోటుగా ఉంది. ఏటూరునాగారం, వెంకటాపురం, మల్లంపల్లి మండలాల్లో సాధారణానికి మించి కురిసింది. మిగతా మండలాల్లో సాధారణంగా నమోదైంది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కూడా..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 470.2 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 393 మిల్లీ మీటర్లు కురిసింది. మహదేవపూర్, కాటారం, ఘన్‌పూర్ (ములుగు), కొత్తపల్లి గోరిలో లోటు, మిగతా మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

మహబూబాబాద్ జిల్లాలోనూ అంతే..

మహబూబాబాద్ జిల్లాలోనూ సాధారణంగా నమోదైంది. వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 386.3 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 379.9 మిల్లీ మీటర్లు నమోదైంది. మహబూబాబాద్, దంతాలపల్లి, తొర్రూరు మండలాల్లో లోటు, బయ్యారం, గార్ల మండలాల్లో సాధారణానికి మించి వర్షం కురిసింది. మిగతా మండలాల్లో సాధారణంగా నమోదైంది.

జనగామ జిల్లాలో లోటు..

జనగామ జిల్లాలో లోటు వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 322.2 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 244.9 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. జిల్లాలోని జఫర్‌గఢ్, స్టేషన్ ఘన్‌పూర్, రఘునాథపల్లి, లింగాలఘణపురం, పాలకుర్తి, కొడకండ్ల మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. జనగామ, తరిగొప్పుల, చిల్పూరు, దేవరుప్పుల, నర్మెట, బచ్చన్నపేట మండలాల్లో సాధారణంగా కురిసింది.

హనుమకొండ జిల్లాలో సాధారణం..

హనుమకొండ జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు 400.3 మిల్లీ మీటర్ల సాధారణ వర్షపాతం కాగా ఇప్పటి వరకు 372.8 మిల్లీ మీటర్లు కురిసింది. ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు మండలంలో లోటు, మిగతా మండలాల్లో సాధారణంగా కురిసింది.

వరంగల్ జిల్లాలోనూ అంతే..

వరంగల్ జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాలో వర్షాకాలం నుంచి ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 421.5 మిల్లీ మీటర్లు కాగా ఇప్పటి వరకు 423.8 మిల్లీ మీటర్లు కురిసింది. రాయపర్తి, ఖిలావరంగల్ మండలంలో లోటు, చెన్నారావుపేట మండలంలో ఎక్కువ, ఇతర మండలాల్లో సాధారణంగా కురిసింది.

జిల్లా వారీగా ప్రధాన పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)..

జిల్లా	వరి		మొక్కజొన్న	
	సాధారణం	సాగైంది	సాధారణం	సాగైంది
వరంగల్	1,27,950	52,104	10,180	11,085
హనుమకొండ	1,41,984	69,051	4,483	7,080
మహబూబాబాద్	2,03,909	62,504	45,390	55,600
ములుగు	99,628	42,504	1,332	7,127
జేఎస్ భూపాలపల్లి	1,08,106	4,231	179	245
జనగామ	1,96,799	80,905	3,342	7,976

జిల్లా	పత్తి	
	సాధారణం	సాగైంది
వరంగల్	1,29,343	1,15,960
హనుమకొండ	92,028	74,849
మహబూబాబాద్	89,219	77,882
ములుగు	24,513	19,371
జేఎస్ భూపాలపల్లి	99,948	98,260
జనగామ	1,45,812	1,02,423

ఉమ్మడి వరంగల్‌లో ప్రధాన పంటల సాగు వివరాలు..

ప్రధాన పంటలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరి పంట సాధారణ సాగు విస్తీర్ణం 8,78,376 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2,76,849 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 3,11,379 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం మొత్తం 64,906 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 50,536 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 89,113 ఎకరాల్లో సాగు చేశారు. పత్తి మొత్తం సాధారణ విస్తీర్ణం 5,79,863 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 5,78,468 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 4,88,745 ఎకరాల్లో సాగైంది.

ఊపందుకున్న పంటల సాగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంటల సాగు ఊపందుకుంది. సాధారణాన్ని మించి పంటల సాగైంది.

- వరంగల్ జిల్లాలో అన్ని పంటలు కలిపి మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 2,84,375 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,79,338 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 1,79,884 ఎకరాల్లో సాగైంది.
- హనుమకొండ జిల్లాలో సాధారణ సాగు మొత్తం 2,43,357 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,08,900 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1,51,383 ఎకరాల్లో సాగైంది.
- మహబూబాబాద్ జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 3,52,531 కాగా ఇప్పటి వరకు 1,94,997 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 2,08,878 ఎకరాల్లో సాగైంది.
- ములుగు జిల్లాలో అన్ని పంటలు కలిపి మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 1,26,973 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 90,318 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 96,264 ఎకరాల్లో సాగైంది.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 2,12,415 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,94,452 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 1,09,457 ఎకరాల్లో సాగు చేశారు.
- జనగామ జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం మొత్తం 3,63,104 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 2,38,499 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 2,03,452 ఎకరాల్లో సాగు చేశారు.
- అన్ని పంటలు కలిపి సాధారణంగా ఇప్పటి వరకు సాగైనా విస్తీర్ణం చూస్తే వరంగల్ జిల్లాలో 63.26 శాతం, హనుమకొండ జిల్లాలో 62.21, మహబూబాబాద్ జిల్లాలో 59.25, ములుగు జిల్లాలో 54.55, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 51.53 శాతం, జనగామ జిల్లాలో 56.03 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి.

పత్తికి పొంచి ఉన్న ప్రమాదం!

- వర్షాలతో పంటలో వడలు తెగులు వచ్చే అవకాశం..
- సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి
- రైతులకు మల్యాల కేవీకే శాస్త్రవేత్త అశ్విని సూచనలు



డి.అశ్విని, మల్యాల కేవీకే శాస్త్రవేత్త

మహబూబాబాద్ రూరల్ : పత్తికి ప్రమాదం పొంచి ఉంది. వర్షాలతో పంటలో వడలు తెగులు వచ్చే అవకాశం ఉంది. దీనిని సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి. లేనిపక్షంలో మొక్కలు వడలిపోయి చనిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి.అశ్విని రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

వడలు తెగులు (పారా విల్ట్)..



పత్తి మొక్కలను ఆశించిన వడలు తెగులు

వర్షాలు ఎక్కువ కురిసి, మురుగు నీరు వెళ్లే సౌకర్యం లేనప్పుడు, నీరు ఆగిన పొలంలో వడలు తెగులు ఎక్కువ ఆశించే అవకాశం ఉంది.

కారణాలు: పత్తి చేనులో నీరు నిల్వ ఉండడం వల్ల వేరులకు గాలి అందక వేరు వ్యవస్థ దెబ్బతింటుంది. దీనివల్ల వేరు భూమిలో నీరు ఉన్నప్పటికీ తీసుకోలేక మొక్కలు వడలి పోతాయి. దీనికిగాను భూమిలో ఉన్న అనేక శిలీంద్రాలు వేరును ఆశిస్తుంది.

లక్షణాలు : తెగులు ఆశించిన సందర్భంలో అన్ని ఆకులు వడలిపోతాయి. తర్వాత ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోతాయి. మొక్కలు పూత, కాత సమయంలో ఎక్కువ వర్షం కురిసి ఇలాంటి పరిస్థితులు ఉంటే ఎక్కువ మొక్కలు వడలు తెగులు లక్షణాలు చూపిస్తాయి. ఆకులు రాలిపోవడం, మొక్కలు ఉన్న కాయలు పగిలిపోవడం వడలు తెగులు ముఖ్య లక్షణం.

నివారణ : వడలు తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే పొలం నుంచి నీటిని తీసివేయాలి. మొక్క మొదళ్ల చుట్టూ మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ వేరు బాగా తడిసేలా పోసుకోవాలి. మొక్క పోషకాలు తీసుకోలేదు. అందుకే పైనుంచి 10 గ్రాముల పాలీ ఫీడ్ లేదా 10 గ్రాముల మల్టీ కే శిలీంద్రనాశినితో కలిపి పిచికారీ చేసుకోవాలి. బోదె సాళ్ల పద్ధతిలో పంట వేసుకుంటే ఈ తెగులు సమస్య తక్కువ ఉంటుంది.

పోలీస్ డ్యూటీ మీట్‌కు సర్వం సిద్ధం..



పోలీస్ డ్యూటీ మీట్‌కు ముస్తాబైన పరేడ్ గ్రౌండ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- హాజరుకానున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్త, అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్
- పీటీసీ గ్రౌండ్‌లో పోలీసుల మాక్ పరేడ్

మామునూరు/వరంగల్ క్రైం: వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో గురువారం తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ -2025 ప్రారంభంకానుంది. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే పోలీస్ డ్యూటీమీట్‌కు సర్వం సిద్ధం చేశారు. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్త, అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్ ముఖ్య అతిథులుగా హాజరై ఉదయం 10 గంటలకు పీటీసీ పరేడ్ గ్రౌండ్‌లో డ్యూటీ మీట్‌ను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ (సీపీ) సన్‌ప్రీత్ సింగ్ బుధవారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు. అతిథులకు గౌరవవందనం సమర్పించేందుకు జిల్లా పోలీసులు మాక్ పరేడ్ నిర్వహించగా.. సీపీ స్వయంగా పరిశీలించారు. ఇప్పటికే ఉమ్మడి పది జిల్లాల నుంచి చేరుకున్నా అధికారులు, పోలీస్ సిబ్బందిని ఒకే చోటుకు చేర్చడానికి పీటీసీ వేదిక మారింది. డ్యూటీ మీట్‌కు ఏడు పోలీస్ జోన్లతోపాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లు, సీఐడీ ఇంటెలిజెన్స్, యాంటీ నార్కొటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ వింగ్ విభాగాలకు చెందిన సుమారు వెయ్యి మందికి పైగా అధికారులు, సిబ్బంది హాజరై సైంటిఫిక్ ఎయిడ్ టు ఇన్వెస్టిగేషన్, యాంటి సబటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్‌స్క్వాడ్ కాంపీటిషన్, ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీకి సంబంధించిన 25 విభాగాల్లో పోటీ పడనున్నారు. ఆగస్టు 2న సాయంత్రం జరిగే ముగింపు సమావేశంలో వివిధ విభాగాల్లో గెలుపొందిన వారికి ప్రశంస పత్రాలు. చాంపియన్ ట్రోఫీలు అందజేస్తారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ వెంట పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ, డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. కాగా, గతంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ జోన్ పోలీస్ డ్యూటీమీట్‌కు వేదికైంది. ప్రస్తుతం రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌కు వేదికైంది.

మానుకోటను కాషాయకోటగా మార్చాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్కార్ కాదు.. ఉత్తుత్తి భాస్కర్ అవార్డు ఇద్దాం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, వేదికపై ధర్మారావు, ప్రేమేందర్‌రెడ్డి, సీతారాంనాయక్ తదితరులు

సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్ అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించి మానుకోటను కాషాయకోటగా మార్చాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అన్నారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మగుడిలో పూజలు చేసిన అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వీఆర్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. 'రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఆ పార్టీ ఢిల్లీ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పొగడడం హాస్యాస్పదం.. ఆయనకు ఆస్కార్ అవార్డు కాదు..ఓ సినిమాలో హాస్యనటుడు బ్రహ్మానందానికి ఇచ్చిన ఉత్తుత్తి భాస్కర అవార్డు ఇద్దాం' అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉత్తర తెలంగాణలో బీజేపీ సత్తా చాటిందని, ఇప్పుడు ఈ గాలి దక్షిణ తెలంగాణకు వీస్తోందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తామనే ధీమా వ్యక్తం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి బీజేపీ వ్యతిరేకం కాదన్నారు. కానీ, బీసీల పేరిట ముస్లింలకు 10శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సరిపడ యూరియా సరఫరా చేస్తుందని, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృత్రిమ కొరతను సృష్టించి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిది ఒకటే డీఎన్ఏ అన్నారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని పార్టీ నాయకులు గజమాలతో సన్మానించారు. బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్, పట్టణ నాయకులు, 60మంది నాయకులు బీజేపీలో చేరారు. కాగా, బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో న్యాయవాదులతో రామచందర్‌రావు కాసేపు ముచ్చటించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, మాజీ ఎంపీ సీతారాంనాయక్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ధార్మిక పరిషత్ రాష్ట్ర కన్వీనర్ సూర్యప్రకాశ్, రాష్ట్ర నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, తలింగాల సుధీర్‌రెడ్డి, వద్దిరాజు రామచందర్‌రావు, యాప సీతయ్య, రాచకొండ కొమురయ్య, వైవీరావు, బైరెడ్డి ప్రభాకర్, శ్యామ్‌సుందర్ శర్మ, గోవర్ధన్, ధర్మారెడ్డి, భూక్య సంగీత, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



జూడో పోటీలను ప్రారంభిస్తున్న వరంగల్ డీవైఎస్‌ఓ సత్యవాణి

రామన్నపేట: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వరంగల్ డీవైఎస్ఓ సత్యవాణి తెలిపారు. వరంగల్ కెమిస్ట్ భవన్‌లో జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, క్యాడెట్ బాలబాలికల జూడో పోటీలను బుధవారం ఆమె ప్రారంభించారు. పోటీల్లో సుమారు 320 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 5,6,7 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కావటి కవిత, ప్రసన్నకుమారి, కెమిస్ట్ భవన్ జాయింట్ సెక్రటరీ రమేశ్‌యాదవ్, తెలంగాణ జూడో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు సీహెచ్.సోమరాజు, డి.సంతోష్ కుమార్, ఎం.నాగరాజు, నిశాంత్, కన్నెబోయిన సారయ్య, జూడో కోచ్‌లు వీరస్వామి, భాస్కర్, ప్రేం, సుధాకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు తిరిగి నిర్వహించాలి



వరంగల్ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు

న్యూశాయంపేట: జిల్లాలో ఈనెల 27న జరిగిన లైసెన్స్ సర్వేయర్ పరీక్షల్లో ప్రశ్నలు, ప్రాక్టికల్స్‌లో జరిగిన తప్పులతో తమకు అన్యాయం జరిగిందని అభ్యర్థులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు బుధవారం వరంగల్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ పరీక్షలు తిరిగి నిర్వహించాలి లేదా తప్పులకు మార్కులు కలపాలని కోరారు. రాజు, శ్రావణి, రుబీనా, అమర్, సాంబరాజు గణేశ్ తదితరులు వినతిపత్రం సమర్పించారు.

బాలికపై దాడి ఘటనలో నేరస్తుడికి మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్ : ప్రేమించమని వేధింపులకు గురి చేయగా బాలిక నిరాకరించడంతో ఆమెపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో నేరం రుజువుకావడంతో నగరంలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన నేరస్తుడు బస్కే నిఖిల్ అలియాస్ డ్యానికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నమ్ బుధవారం తీర్పు వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందాదేవి కథనం ప్రకారం.. నగరంలోని అబ్బనికుంటకి చెందిన ఓ బాలిక ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సమయంలో బస్కే నిఖిల్ తనను ప్రేమించాలని వేధించేవాడు. బాలిక ఈ విషయాన్ని తన తండ్రికి తెలపడంతో నిందితుడిని మందలించాడు. అనంతరం సదరు బాలిక 2020, జూన్17న తన చెల్లితో కలిసి ఇంట్లో ఉన్న సమయంలో నిఖిల్ ఇంట్లో చొరబడి ప్రేమిస్తావా లేదా అని భయభ్రాంతులకు గురి చేశాడు. దీనికి బాలిక ఒప్పుకోకపోవడంతో మద్యం సీసాతో విచక్షణరహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక.. కేకలు వేయగా అటువైపుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించాడు. దీంతో నిఖిల్ పారిపోయాడు. బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు బస్కే నిఖిల్ అలియాస్ డ్యానికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ జడ్జి మనీషా శ్రావణ్ ఉన్నమ్ తీర్పులో పేర్కొన్నారు. కేసును సీఐ రమేష్, ఎస్సై సతీశ్ చందర్ పరిశోధించగా లైజన్ ఆఫీసర్ కె.హరికృష్ణ, భరోసా లీగల్ ఆఫీసర్ చుక్క నీరజ పర్యవేక్షణలో సాక్షులను కానిస్టేబుల్ దొడు ప్రతాప్, సదానందం కోర్టులో ప్రవేశపెట్టారు.

క్రమశిక్షణతోనే అత్యున్నత స్థాయికి..

- ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చాన్స్‌లర్ వరదారెడ్డి

హసన్‌పర్తి : క్రమశిక్షణతోనే అత్యున్నత స్థాయికి చేరుకుంటారని ఎస్సార్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి అన్నారు. ఎస్సార్ యూనివర్సిటీ ప్రవేశం పొందిన బీటెక్ విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరదారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విజయం కోసం సులువు మార్గాలు ఉండవన్నారు. విద్యార్థులు కష్టపడి చదివితేనే లక్ష్యం సాధ్యమన్నారు. యూనివర్సిటీ వీసీ దీపక్ గార్గ్ మాట్లాడుతూ నాలుగేళ్ల విద్యాకాలంలో స్వీయ అభివృద్ధి-స్వీయ పరిచయంపై దృష్టిసారించాలన్నారు. కరికులం సంస్కరణలు, పరీక్ష విధానంలో మార్పులు, ఎలక్టివ్ ఛాయిస్‌లు, గేమిఫికేషన్, మెంటరింగ్ విధానాల గురించి వివరించారు. ఎస్సార్ యూనివర్సిటీలో ఓపెన్ డోర్ పాలసీ అమలులో ఉందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అర్చనారెడ్డి, ప్రొఫెసర్ డాక్టర్ వి.మహేశ్, డాక్టర్ రామ్‌దేశ్‌ముఖ్, డైరెక్టర్లు శేషగిరావు, శరత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు అవసరం

- సీనియర్ సైంటిస్ట్ చంద్రగోపరాజు



సైంటిస్ట్‌లతో అధ్యాపకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: మానవాళికి ఉపయోగపడే పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని అమెరికా న్యూయార్క్‌లోని సీనియర్ సైంటిస్ట్ చంద్రగోపరాజు అన్నారు. బుధవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో 'బయోమెటికల్ రీసెర్చ్ ఎక్స్‌ప్లోరింగ్ ది ఫ్రంటియర్స్ ఆఫ్ హెల్త్ అండ్ డిసీస్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవాళి వివిధ రకాల కేన్సర్ల బారినపడుతున్నారని, కేన్సర్‌ను మొదటిదశలోనే గుర్తించి అందుకు అనుగుణంగా వైద్యం తీసుకోవడం ముఖ్యమన్నారు. అనంతరం వరంగల్ నిట్ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ అమితవ బిందు మాట్లాడుతూ టీబీ మళ్లీ విస్తరిస్తోందన్నారు. టీబీ అంటు వ్యాధి అని, టీబీ బారిన పడినవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హనుమకొండ వాసవి హాస్పిటల్స్ డైరెక్టర్ వాసవిరెడ్డి.. మహిళలు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సదస్సుకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. జువాలజీ విభాగం అధిపతి అలువాల సంజీవయ్య, కన్వీనర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మ రోహిణి, అధ్యాపకులు దినేశ్, గౌరి, రాజయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.